# ప్రణవ పద్మాకరం

ఆగష్టు 2024









**నాగులచవితి మరియు గరుడపంచమి శుభాకాంక్షలు**

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

ఆగష్టు , 2024

## విషయ సూచిక

సంపుటి-3

సంచిక-8


01 సంపాదకీయం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

04 శ్రీ గణేశ పురాణం — శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య

05 శ్రీ వేంకటేశ్వర రహస్యం — శ్రీమతి నిడుముక్కల శ్రీకలి

06 పురాణంలో మహిళలు — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

07 ఐశ్వర్యయోగం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

08 ఋషిచరిత్ర — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

09 కాశీ కథలు — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

10 స్తోత్రమాలిక — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్


14 గురుదేవుల జీవన కవనము — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం


శ్రీ మహాగణాధిపతయే నమః　　శ్రీ గురుభ్యోనమః　　శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




యజ్ఞముల ద్వారా, అగ్నికార్యముల ద్వారా పరమాత్మతో మనలను అనుసంధానం చేస్తాడు పంచభూతదివ్యస్వరూపుడు అగ్నిభగవానుడు.ఆ అగ్నిభగవానుని ద్వారా వశిష్ఠునికి చెప్పబడి వేదవ్యాసునిచే లోకానికి అందించబడినది ఈ అగ్నిపురాణం. సంక్షిప్తంగా నవాహ (౯ రోజుల) పారాయణమునకు వీలుగా అభినవశుక, ప్రవచననిధి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు, వారి దివ్యాశీస్సులతో తమ శిష్యులచే సంకలం చేయించిన ఈ గ్రంధాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణ చేసినవారికి సమస్త వాస్తుదోషాలు, శత్రుపీడలు తొలగి, భయంకర కష్టాల్లోంచి బయటపడతారు. పుష్కరంలో స్నానం చేసి నూరు కపిలగోవులను దానం చేసిన మహాఫలితం పొందుతారు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు


## సంపాదకీయం

## శాంతిని పొందడం ఎలా!



**ఆశయా బద్ధతే లోకః** అని ఆర్షవాక్కు. లోకమంతా ఆశతో బంధింపబడుతున్నది. ఆశ లేని జీవి ఉండడుగానీ, దురాశ ప్రమాదమని దీని సారాంశం. కష్టార్జితం మీద కాకుండా, అన్యాయార్జితం మీద దృష్టి పెట్టడం వల్లే జీవులు అశాంతిపాలవుతున్నారు. పాపార్జన ఎంత చేసినా మానవుడికి తృప్తి ఉండదు. అందుకే పోతన భాగవతంలో, వామనావతార ఘట్టంలో — "ఆశాపాశము తాగడున్ నిడుపులే దంతంబు రాజేంద్ర!" - అని వామనుడి ద్వారా కవిగారు పలికించారు. ధర్మమార్గంలో సంపాదించిన ధనం శాంతిని ప్రసాదిస్తుంది. సద్బుద్ధిని, సన్మార్గంలో ధనాన్ని ప్రసాదించే వ్రతం శ్రీవరలక్ష్మీవ్రతం ఈ శ్రావణమాసంలో వస్తున్నది. భక్తులు యథాశక్తిగా ఈ వ్రతాన్ని చేసి అమ్మవారి అనుగ్రహం పొందండి.జీవితం చాలా విచిత్రమైనది. ఆహారం, నిద్ర మొదలైనవి లేకపోతే శరీరం నిలబడదు. వాటి కోసం ప్రస్తుతకాలంలో ఉరుకులు పరుగులతో కూడిన "ఉద్యోగం" అనే పేరు పొందిన చాకిరీలు చేసి ఈనాటి ప్రాణులు ప్రాణాల మీదికి తెచ్చుకొంటున్నారు. పనిచేయడం తప్పనిసరి కూడా. అశాంతి, హడావిడితో కూడిన మన ప్రస్తుత జీవితానికి దైవోపాసన శాంతిని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. వేదాన్ని వినడం ఉపాసనలో ఒక భాగం. నిత్యం వినగలిగిన వారు అదృష్టవంతులు. కనీసం శ్రావణ పూర్ణిమనాడైనా వేదపండితులను పూజించి, కొంతసేపు వేదాన్ని వినండి.కన్నుమూసి తెరచేలోపు కాలం గడిచిపోతుంది, ఆయువు నశిస్తోంది. ఈ మానవ శరీరం పోయాక ఏ జన్మ వస్తుందో మనకు తెలియదు. కనుక ఈ జన్మని సద్వినియోగం చేసుకోవాలి. కలియుగంలో నామస్మరణం, స్తోత్రశ్రవణం, పురాణాలు వినడం, యథాశక్తి దానం చేయడం వల్ల, ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు పెట్టకుండా, వార్ధక్యంలో బ్రతకడానికి వీలుగా దాచి పెట్టుకోవడం వల్ల శాంతిని పొందవచ్చని ఋషులు చెప్పారు. వీలైనంతవరకు వీటిని ఆచరణలో పెట్టండి. గుడి - బడి కార్యక్రమాలు నిర్వహించండి. కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయకండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి. విద్యానిధి అనే పేరుతో ప్రణవపీఠం చేపడుతున్న కార్యక్రమంలో పాల్గొనడం వల్ల జీవితం శాంతిమయం అవుతుంది. మహాత్ములైన సాధకులు ఈ పని చేసి తరించాలని మంగళాశాసనం చేస్తున్నాను.....

వద్దిపర్తి పద్మాకర్

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు



# ప్రణవ దీప్తి

## విద్యానిధి

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి దివ్య ఆశీస్సులతో శ్రీ ప్రణవ పీఠం శిష్య బృందం నిర్వహిస్తున్న మహత్తర కార్యక్రమం విద్యానిధి. ఈ కార్యక్రమం ద్వారా వేల సంఖ్యలో ఆస్తికులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా స్తోత్రాలు, పూజా విధానాలు ,ఆసక్తి కలిగి అర్హులైన వారికి వేద సూక్తములు,భాగవత పద్యాలు ,సంగీతం ,హారతి పాటలు, భగవద్గీత వంటివి గురు భక్తులకు నేర్పుతున్నారు.తెలుగు, హిందీ ,సంస్కృత భాషలను,వేద గణితము,జియోగ్రఫీ ,గణితము వంటివి దేశ,విదేశాలలోని పిల్లలకు నేర్పుతున్నారు. ఉపాధికి అవసరమయ్యే అనేక విషయాలను కూడా ఈ కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తున్నారు

విద్యానిధి Updates కొఱకు క్రింద ఇవ్వబడిన whats app channel ను అనుసరించ గలరు
https://whatsapp.com/channel/0029VaH7mEJK5cD86BWCig40

శ్రీ ప్రణవపీఠం వారి విద్యా నిధి ఏలూరు

శ్రీ ప్రణవపీఠం సత్యం వద - ధర్మం చర ఏలూరు

శ్రీ ప్రణవపీఠం వారి గుడి-బడి ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు


# శ్రీ మద్భాగవత పుస్తకావిష్కరణ సమాచారం



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు,శృంగేరి శారదా మఠం,గుంటూర్ లో 40 రోజుల పాటు శ్రీమద్భాగవతం ప్రవచించారు. శ్రీ ప్రణవ పీఠం భక్త బృందం గురుదేవులు అందించిన ప్రవచనములను గురుదేవుల అనుగ్రహ ఆశీస్సులతో పుస్తక రూపం లో భక్తులకు అందుబాటులో తీసుకొని రానున్నారు. ఈ దివ్య గ్రంథం సెప్టెంబర్ మాసం లో గురువు గారు ఆవిష్కరించనున్నారు. భాగవతం అంటే కృష్ణ పరమాత్మ ,కృష్ణ స్వరూపమే. భాగవతమును స్పృశించడము అంటే శ్రీ కృష్ణ పరమాత్మ శరీరమును స్పృశించడమే . ఇటువంటి భాగవతము ను గురుదేవులు భక్తులకు పుస్తక రూపం లో అందించారు. ద్వారకా నగరంలో భాగవతమునకు బంగారు పల్లకీ సేవ చేయనున్నారు.

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ గణేశ పురాణం



శ్లోII గురుర్ బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురురేవ పరం బ్రహ్మ బ్రాహ్మణేభ్యః ప్రియః పరః
(బ్ర.వై.పు.తృ.ఖం.అ.40.శ్లో.8౯)

గురువు సృష్టికర్త అయిన బ్రహ్మ వంటివాడు. గురువే పోషకుడైన విష్ణువు. గురువు లయకారకుడైన మహేశ్వరుడు. గురువే పరబ్రహ్మ. బ్రహ్మాదుల కంటె ఎక్కువగా ప్రేమించ వలసినవాడు గురువే. గురువు జ్ఞానాన్ని ఇస్తాడు. హరిభక్తిని ప్రసాదిస్తాడు. విష్ణుభక్తిని పెంపొందించే గురువుకంటె బంధువు మరెవ్వడూ లేడు. ఉండడు.

శ్లోII అజ్ఞానతిమిరాచ్ఛన్నః జ్ఞాన దీపం యతో లభేత్
లబ్ధ్వాచ నిర్మలం పశ్యేత్ కోవా బంధుః తతః పరః
(బ్ర.వై.పు.తృ.ఖం.అ.40.శ్లో.౯౧)

అజ్ఞానమనబడే చీకటి చేత కప్పబడిన మానవునిలో జ్ఞానదీపం వెలిగించి, అజ్ఞానాన్ని తొలగించేవాడు, నిర్మలునిగా చేసేవాడు అయిన గురువుకంటె గొప్ప బంధువును ఎవడు చూడగలడు? అనగా గురువును మించిన బంధువు లేనేలేడని భావం. గురుమంత్రజపం చేసి శిష్యుడు జ్ఞానం పొందుతాడు. మంత్రజపం వల్ల సర్వజ్ఞత్వం సిద్ధిస్తుంది. గురుదత్త మంత్రం వలన సుఖ లబ్ధి అవుతుంది. అంతటా విజయం ప్రాప్తిస్తుంది.

శ్లోII విద్యాంధోవా ధనాంధోవా యో మూఢో న యజేద్ గురుమ్
బ్రహ్మ హత్యాదికం పాపం లభతే నాత్ర సంశయః II
(బ్ర.వై.పు.తృ.ఖం.అ.40.శ్లో.౯4)


విద్యామదంతో, ధనముందని అహంకరించి గ్రుడ్డి వాడి లాగా ప్రవర్తిసూ, గురువును పూజించని పాపాత్మునికి బ్రహ్మహత్యా పాపం లభిస్తుంది. ఇందులో సందేహం లేదు. గురువు దరిద్రుడైనా, పతితుడైనా, సామాన్యుడైనా, గౌరవించవలసినదే. గురువును అజ్ఞాని మాత్రమే పతితునిగా భావిస్తాడు. మానవమాత్రుడని భావించి, అల్పుడని ఎంచి గురువును గౌరవించని మూర్ఖుడు ఎన్ని పుణ్యతీర్థ స్నానాలు చేసినా పవిత్రుడు అవ్వలేడు. ఏ పుణ్యకర్మలు చేయడానికీ గురుద్రోహికి అధికారం లేదు. కనుక పరశురామా! "నీ గురువైన శంకరుని దర్శించి పూజించు. గురు కటాక్షం వల్లనే నీకు శుభాలు, పరాక్రమం కలిగాయి. దోష విముక్తికి, పుణ్య ప్రాప్తికి గురుదర్శనమే మూలం. ఆలస్యం చేయక గురువైన హరిని శరణు కోరుకో. శివుడు మంగళ మూర్తి. మంగళదాత. శుభప్రదాత. శాంతస్వరూపుడు. కృష్ణుడు ఆత్మ అయితే, శివుడు జ్ఞాన స్వరూపుడు. బ్రహ్మనైన నేను మనస్సును. ప్రకృతి సర్వశక్తి." ఇలా బ్రహ్మ చెప్పగా పరశురాముడు శివదర్శనానికి బయలుదేరాడు.

...ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## వెంకటాద్రి పై నరసింహస్వామి



నా శరీరం దుర్వాసనతో నిండిపోయింది. శరీరబాధ, మానసిక బాధలతో జీవచ్ఛవంలా ఉన్నాను. నాకు తెలుసు, నా పాపాల వలననే ఈ భయంకరరోగం వచ్చిందని.పాపతాపశాపాల నుండి నన్నుద్ధరించే వారెవరూ లేరు. కానీ నా భాగ్యం వల్ల దేవలుడు అనే మహర్షి ఇక్కడకు వచ్చాడని భక్తులు అనుకుంటే విని ఇక్కడకు వచ్చాను. మీరే దేవలుడని గ్రహించాను. స్వామీ! ఈ పరమ పాపాత్మురాలికి హేమజ్యోతి అనే పేరు పెద్దలు పెట్టారు. ఇప్పుడు నా శరీరంలో హేమం లేదు. జీవితంలో జ్యోతి లేదు. నన్ను పాపవిముక్తురాలిని చేసి పవిత్రమార్గంలో నడపండి. లేదా ఆత్మహత్య చేసుకోవడానికి అనుమతినివ్వండి. ఈ విధంగా రోగ స్వరూపిణి అయిన హేమజ్యోతి ప్రార్థించగా, దేవలుడు ఆమె కథ విని కరిగిపోయాడు. ఆమెను దేవలుడు నీలకంఠ నరసింహస్వామి సన్నిధికి తీసుకొనివచ్చాడు. నరసింహకథను వినిపించి, తులసీదళాలతో నరసింహుని అర్చించాడు. పానకాన్ని నివేదించాడు. తులసీతీర్థం, పానకం ఆమెకు త్రాగడానికి తీర్థంగా ఇవ్వగా ఆమె భక్తితో త్రాగింది. భయంకర కుష్ఠరోగం ఆ క్షణమే ఆమెను విడిచిపెట్టింది. మహాపాపాలు తొలగించే దివ్యమూర్తి వేంకటాచలంపై ఉన్న, నరసింహమూర్తి. అనంతరం దేవలుడు, అక్కడ ఉన్నభక్తులతో ఇలా అన్నాడు — ఈ హేమజ్యోతి కథ విన్నారు గదా! ఇది మనందరకూ గుణపాఠం. మహాత్ములైన సన్న్యాసులను, పౌరాణికులను, పాడుచేసి, అప్రతిష్ఠ పాలు చేసేవారికి ఇలాంటి దుర్గతులు తప్పవు. ఈమెకు యోగం బాగుండి నరసింహకరుణతో రోగం తగ్గింది. కాని ఈ యోగం అందరకూ కలగదు. భగవంతుని సేవించి తరించాలనే ఆలోచన రానేరాదు. కనుక జాగ్రత్తగా ఉండండి. వేంకటాచలంపై ఎన్నో మహిమ గల ఆలయాలు ఉన్నాయి. వాటిని సేవించి తరించండి. భక్తులు అలాగేనన్నారు. ఈ దేవలహేమజ్యోతి సంవాదం, నరసింహమహిమ కథ విన్నవారు, ఇతరులకు వినిపించినవారు, దీనిని వ్రాసి ఇతరులకు పంచిపెట్టడం వల్ల రోగాల నుండి విముక్తులవుతారు. వ్రాసి పంచిపెట్టేవారు, గురువుగారి దయవల్ల వ్రాసామని తాము వ్రాసిన వ్రాత ప్రతిలో వ్రాయాలి. గురువు పేరును అందులో వ్రాయకపోతే దొంగతనం చేసిన పాపం పొందుతారు. కనుక మన గురుదేవులైన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి దయతో ఈ కథను వ్రాసిపంచుతున్నామని వ్రాయండి. తరించండి.

....ఇంకా ఉంది

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# పురాణం లో మహిళలు

## భానుమతి



మహాభారతంలోని స్త్రీ పాత్రలలో భర్త దుర్మార్గాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నించి తన వ్యక్తిత్వంతో సాధ్వీమణిగా పేరు తెచ్చుకున్న దుర్యోధనుడి భార్య భానుమతి గురించి పురాణంలో మహిళ శీర్షికన మనం తెలుసుకుందాం. భానుమతి గురించి ముఖ్యంగా రెండు రకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఇదిమిద్దంగా ఏది ప్రామాణికము తెలియనప్పటికీ ప్రచారంలో మాత్రం ఉన్నాయి. అందులో ఒక కథ ప్రకారం పాంచాల దేశ రాజకుమారి ద్రౌపది స్వయంవరానికి వెళ్ళి, అక్కడ అర్జునుడి ముందు ఓడిపోయిన దుర్యోధనుడు ఆ ఓటమిని పదేపదే తలుచుకొని కుమిలిపోతూ ఉండగా కలింగరాజు కుమార్తె భానుమతి స్వయంవరం జరుగుతున్నటువంటి విషయం తెలుస్తుంది. దాంతో కర్ణునితో కలిసి స్వయంవరంలో పాల్గొంటాడు. దీనిలో పాల్గొనేందుకు శిశుపాలుడు, జరాసంధుడు వంటి మహామహులందరూ వచ్చి ఉంటారు. స్వయంవరం ఆరంభం కాగానే తన చెలికత్తెలతో కలిసి సభలోకి ప్రవేశిస్తుంది భానుమతి. ఆమె పక్కన ఉన్న చెలికత్తెలు ఒక్కొక్క రాజకుమారుడి గురించి వర్ణిస్తూ ఉండగా వారిని పరికిస్తూ ముందుకు సాగుతుంది. దుర్యోధనుడి వంతు వచ్చేసరికి అతన్ని చూసిచూడనట్లుగా ముందుకు సాగిపోతుంది. ఈ చర్యతో దుర్యోధనుని అహంకారం దెబ్బతిని తిరస్కారాన్ని భరించలేక వెంటనే భానుమతిని అమాంతం ఎత్తుకొని హస్తినాపురం వైపు బయలుదేరుతాడు. దుర్యోధనునిని అడ్డుకునేందుకు వచ్చిన ఇతర రాజకుమారులను అడ్డగించి ఓడించే బాధ్యతను కర్ణుడు తీసుకొంటారు. అలా భానుమతిని బలవంతంగా హస్తినకు తీసుకొని వచ్చి అక్కడ ఆమెను వివాహం చేసుకుంటాడు దుర్యోధనుడు. ఇదేమిటంటూ ప్రశ్నించిన వారికి ఒకప్పుడు మా తాత భీష్ముడు కూడా కాశీరాజు కుమార్తెలైన అంబ, అంబికా, అంబాలికలను ఈ విధంగానే ఎత్తుకు వచ్చాడు కదా! అని మారు మాట్లాడకుండా చేస్తాడు. మరొక కథనం ప్రకారం అర్జునుడు స్వయంవరంలో ద్రౌపదిని గెలుచుకొని పాండవులను పెళ్ళి చేసుకున్న తర్వాత దుర్యోధనుడు అసూయతో రగిలిపోతూ ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతాడు. అప్పుడు అతని మామ శకుని ద్వారా కాశీరాజు చిత్రాంగదుడు తన కూతురు భానుమతికి స్వయంవరం ఏర్పాటు చేస్తున్నాడని చెప్పి దుర్యోధనుని ఆ స్వయంవరానికి వెళ్ళమని ప్రోత్సహిస్తాడు. దుర్యోధనుడు తన మిత్రులందరు బయలుదేరుతారు. బలపరీక్ష లేని ఈ స్వయంవరం పాల్గొనటానికి కేవలం ఒక రాజ్యానికి యువరాజు అయ్యుండటమే అర్హత. భానుమతి సభలోకి పూలమాలతో అడుగుపెట్టగానే దుర్యోధనుడు వెంటనే ఆమెను ఎత్తుకొని హస్తినాపురానికి చేరి వివాహం చేసుకుంటాడు.


..ఇంకాఉంది

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 334 . విశ్వాధికా [ఓం ఐం హ్రీం శ్రీం విశ్వాధికా యై నమః]



**విశ్వ**మునకంటె అధికురాలు. సర్వప్రపంచంలో వ్యాపించి అంతటా తానే నిండి ఉండునది. సకలలోకాలకంటే అధిక వ్యాపకత్వం కలిగినది. ఈ చరాచర జగత్తులలో అమ్మవారి కంటె అధికమైన వస్తువుకానీ, ప్రాణికానీ కనపడదు.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

సర్వుల చేతా పూజలు అందుకోవాలనీ, అందరికంటే గొప్ప వాడిని కావాలనీ, లేదా తనకొక గుర్తింపు కావాలనీ కోరుకొనే వారికి ఈ మంత్రం గొప్ప వరం. మారేడాకులతో అమ్మవారిని పూజిస్తూ ఈ మంత్రాన్ని 108 దినాలు యథాశక్తిగా జపించాలి. నైవేద్యం మనం తినే పవిత్రాహారమేదైనా సరే. పూజ అయిపోయాక ఆ మారేడాకులను నదిలోకాని లేదా పొలాలలో కాని వేస్తే మంచిది. ఎండిన తరువాత ఆ ఆకులను హోమానికి వాడితే ఇంకా మంచిది.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో


ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ఋషి చరిత్ర

## వశిష్ఠ మహర్షి

బ్రహ్మదేవుని మానసపుత్రులలో మహర్షి వశిష్ఠుడు ఒకరు. బ్రహ్మ తన యోగమాయ ద్వారా పదునాలుగురు మానసపుత్రులను సృష్టించాడు. వారిలో మొదటి ఏడుగురు వైరాగ్యమును స్వీకరించగా, మిగిలిన ఏడుగురు గృహస్థాశ్రమాన్ని స్వీకరించాడు. వశిష్ఠమహర్షి గృహస్థాశ్రమాన్ని స్వీకరించి తన గృహ జీవితంతో పాటు, యాగాలు, తపస్సులు మరియు గ్రంధాలలో అధ్యయనం చేయడం మరియు శిక్షణ ఇవ్వడం వంటివి చేస్తుండేవాడు. తద్వార సృష్టి, రక్షణ, త్యాగం ద్వారా ప్రపంచానికి మార్గనిర్దేశం చేసాడు. పురాణాలలో వశిష్ఠమహర్షి మిత్రవరుణుల కుమారుడిగా మరియు మరికొన్ని చోట్ల అగ్ని కుమారునిగా పేర్కొనబడింది. సప్తఋషులలో వశిష్ఠమహర్షి ఒకరు. వసిష్ఠ అనే పదం అసమానమైన ప్రకాశాన్ని సూచిస్తుంది. అతని పేరు ప్రకారం కోరిక, కోపం, లోపము, అసూయ మరియు గర్వం వంటి ప్రతికూల లక్షణాలన్నింటినీ జయించాడు. అతను శ్రీరాముడు మరియు రాజు హరిశ్చంద్రుని గురువుగా పరిగణించబడ్డాడు. మహర్షి వశిష్ఠుడు "ఋగ్వేదం" యొక్క రచయితలలో ఒకడు. ఇది పురాతనమైనది మరియు హిందూమతంలో ముఖ్యమైనది మహర్షి వశిష్ఠుని వద్ద దివ్యమైన ఆవులు కామధేనువు మరియు ఆమె కుమార్తె నందిని ఉన్నారు. మహర్షి వశిష్ఠుడు రామాయణ మరియు మహాభారత కాలం రెండింటిలోనూ ఉన్న ప్రముఖ వ్యక్తి.వశిష్ఠుడు త్యాగి. నిష్కాముకుడు. స్వతంత్ర ప్రజ్ఞాశాలి. ఆధ్యాత్మిక, యోగజ్ఞానాలతో రాజనీతిని సమన్వయం చేసి ఇక్ష్వాకుల వంశాన్ని వశిష్ఠుడు ప్రభావితం చేసాడు. వశిష్టుని దగ్గరే రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు విద్య నేర్చుకొంటారు. అయితే శత్రువుల రాకపోకలు, వారి శక్తిసామర్థ్యాలను అంచనావేయటం, అదుపు చేయటంలో రాజర్షి విశ్వామిత్రుడు తనకంటే ప్రావీణ్యం గలవాడని వశిష్ఠుడు గుర్తించాడు. ఎందుకంటే విశ్వామిత్రుడు రాజర్షి కాబట్టి. అందుకే తాను చెప్పలేని కొన్ని విద్యలను రామలక్ష్మణులు విశ్వామిత్రుని వద్ద నేర్చుకునేందుకు పరోక్షకారకుడౌతాడు. పసిపిల్లలైన రామలక్ష్మణులను తన యాగరక్షణ కోసం పంపాలని విశ్వామిత్రుడు దశరథుడిని కోరుతాడు. తనకు లేకలేక కలిగిన పిల్లలు, అత్యంత సుకుమారులు, అల్లారుముద్దుగా పెంచుకొనే తన పిల్లలను అరణ్యాలకు పంపడానికి దశరథుడు తటపటాయిస్తాడు. అప్పుడు వశిష్ఠమహర్షి “మహారాజా! విశ్వామిత్రుడు శత్రువులను సంహరించగల సమర్థుడే. మీ పిల్లలకు అనుభవంతో ప్రావీణ్యం పెరిగి, భయం తొలగి హితం కలగుతుంది. నిరభ్యంతరంగా పంపండి” అని ప్రోత్సహిస్తాడు. దీనివల్ల దశరథుని మాట దక్కుతుంది. విశ్వామిత్రుని లక్ష్యం నెరవేరుతుంది

...ఇంకావుంది



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం

**ఘం**టకర్ణుడు,మహోదరుడు కాశీ నుండి తిరిగి రాకపోవడం వలన,కాశీ మహిమ అటువంటిది, కాశీని వదిలి ఎవరూ రారు అని శివుడు తలచెను.కార్యక్రమం పూర్తి చేయాలి కనుక నేను మరికొందరిని పంపుతాను అని తలచి, సోమనంది,నందిషేణ, కాల,పింగళ,కుక్కుట అను నామములు కల ఐదుగురు ప్రమధ గణములను కాశీకి పంపెను.ఏ విధంగా కాశీలో మరణించినవారు తిరిగి పునర్జన్మను పొందరో ఆ విధంగా కాశీని చేరిన వీరు తిరిగి రాలేదు. మహాదేవుని ప్రీతి కొఱకు అందరూ వారివారి నామములతో ఒక శివలింగమును స్థాపించి,మోక్షద్వారం అయిన కాశీ లో ఉండిపోయిరి.సోమనంది ప్రతిష్ఠ చేసిన సోమనందేశ్వర లింగమును దర్శించినవారు సోమలోకంలో సుఖసంతోషములను, సోమానందమును పొందుతారు. నందిషేణ ప్రతిష్ఠ చేసిన నందిషేణేశ్వర లింగమును దర్శించిన వారికి ఆనందము కలుగుతుంది,వారు మృత్యుంజయులు కూడా అవుతారు.గంగకు పశ్చిమోత్తరం వైపు కాలుడు ప్రతిష్ఠ చేసిన కాలేశ్వర లింగమును దర్శించిన వారికి కాల భయము ఉండదు. కాలేశ్వరునికి ఉత్తరమున పింగళుడు ప్రతిష్ఠించిన పింగలేశ్వర లింగం ఉన్నది. ఈ లింగము దర్శించిన వారికి శరీరంలో పింగళ జ్ఞానము ప్రాప్తిస్తుంది.కుక్కుటుడు ప్రతిష్ఠించిన కుక్కుటేశ్వర లింగ దర్శనం వలన మళ్ళీ గర్భమున ప్రవేశించరు. కాశీకి వెళ్లిన సోమనంద తదితర ప్రమధ గణములనుండి శివునికి ఎటువంటి వార్త అందలేదు. అప్పుడు శివుడు గణములు కూడా తిరిగి రావటం లేదు అంటే నా ఆగమనమునకు కూడా సమయం ఆసన్నమైంది అని తలచెను.ఇందులో ఎటువంటి సందేహం లేదు అని భావించి,నా ఆత్మీయులందరినీ కాశీకి పంపి అంతిమంగా నేను కాశీ ప్రవేశం చేస్తాను అని శివుడు భావించెను. ఈ విధంగా నిశ్చయించుకున్న శివుడు కుంభధర,మయూర, బాణ, గోకర్ణ అను నామములు కలిగిన నలుగురు ప్రమధ గణములను కాశీకి పంపెను. వారు కూడా కాశీలో నానా ఉపాయములతో దివోదాసును ధర్మచ్యుడిని చేయాలనుకుని విఫలమయ్యారు. వీరు నలుగురు కూడా శివ కార్యం పూర్తి చేయలేక దివోదాసుడిని ధర్మచ్యుతుడిని చేయలేక ప్రీతితో కాశీలో శివారాధన చేయసాగారు.కాశీలో ఎవరైతే శివలింగార్చన విధిని తెలుసుకొని లింగార్చన చేస్తారో వారికి రెండు కళ్లు కాదు మూడవ కన్ను కూడా కలిగి సాక్షాత్తు శివుడే అవుతారు అని తెలుసుకున్నారు.లక్షలకొలది గోవులను,లక్షలకొలది బంగారు కాసులను దానము చేయు వల్ల కలుగు ఫలితం ఒక్కసారి శివలింగార్చన చేయుట వలన కలుగుతుంది,అని భావించారు. విధివిధానపూర్వకముగా శివలింగమునకు అభిషేకించిన జలం మూడు సార్లు స్వీకరిస్తే వారికి ఈ జన్మలో అప్పటి వరకు మూడు విధములైన పాపముల నుండి ముక్తి కలుగుతుంది. లింగములను అభిషేకించిన జలమును తలపై చల్లుకున్న వారికి గంగా స్నానం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు అనగా గంగా స్నానం కన్నా అధిక రెట్ల ఫలితం ఉంటుంది అని అర్థం. శివలింగమును అర్చించిన వారికి, అర్చించిన శివలింగమునకు నమస్కరించిన వారికి పునర్జన్మ ఉండదు.భక్తిపూర్వకంగా శివలింగమును స్థాపించిన మానవులకు ఏడు జన్మల పాపం నశించి స్వర్గవాసం కలుగుతుంది. ఈ విధంగా ఆలోచించిన ఈ నలుగురు వారి వారి పేర్లతో శివలింగములను ప్రతిష్ఠ చేసారు.

...ఇంకావుంది

# స్తోత్రమాలిక

## శ్రీ నారాయణకవచము (షష్ఠస్కంధము - భాగవతము)

**రాజోవాచ:**

యయా గుప్తః సహస్రాక్షః సవాహాన్ రిపుసైనికాన్ | క్రీడన్నివ వినిర్జిత్య త్రిలోక్యా బుభుజే శ్రియమ్ ||1

భగవంస్తన్మమాఖ్యాహి వర్మ నారాయణాత్మకమ్ |యథాఽఽ తతాయినః శత్రూన్ యేన గుప్తోఽ జయన్మృధే ||2

**శ్రీ శుక ఉవాచ:**

వృతః పురోహితస్త్వాష్ట్రో మహేంద్రాయానుపృచ్ఛతే | నారాయణాఖ్యం వర్మాహ తదిహైకమనాః శృణు ||3

**విశ్వరూప ఉవాచ:**

ధౌతాంఘ్రిపాణిరాచమ్య సపవిత్ర ఉదఙ్ముఖః |కృతస్వాంగకరన్యాసో మంత్రాభ్యాం వాగ్యతః శుచిః || 4

నారాయణమయం వర్మ సన్నహ్యేద్భయ ఆగతే | పాదయోర్జానునోరూర్వోరుదరే హృద్యథోరసి ||5

ముఖే శిరస్యానుపూర్వ్యాదోంకారాదీని విన్యసేత్ |ఓం నమో నారాయణాయేతి విపర్యయమథాపి వా||6

కరన్యాసం తతః కుర్యాద్ద్వాదశాక్షరవిద్యయా |ప్రణవాదియకారాన్తమంగుళ్యంగుష్ఠపర్వసు ||7

న్యసేద్ధృదయ ఓంకారం వికారమను మూర్ధని |షకారం తు భ్రువోర్మధ్యే ణకారం శిఖయా దిశేత్ ||8

వేకారం నేత్రయోర్యుంజ్యాన్నకారం సర్వసంధిషు |మకారమస్త్రముద్దిశ్య మంత్రమూర్తిర్భవేద్బుధః ||9

సవిసర్గం షడంతం తత్ సర్వదిక్షు వినిర్దిశేత్ |ఓం విష్ణవే నమ ఇతి||10

ఆత్మానం పరమం ధ్యాయేద్ధ్యేయం షట్ఛక్తిభిర్యుతమ్ |విద్యాతేజస్తపోమూర్తిమిమం మంత్రముదాహరేత్ ||11

ఓం హరిర్విదధ్యాన్మమ సర్వరక్షాం న్యస్తాంఘ్రిపద్మః పతగేంద్రపృష్ఠే|

దరారిచర్మాసిగదేషుచాప -పాశాన్ దధానోఽష్టగుణోఽష్టబాహుః||12

జలేషు మాం రక్షతు మత్స్యమూర్తిః యాదోగణేభ్యో వరుణస్య పాశాత్ |

స్థలేషు మాయావటువామనోఽవ్యాత్ త్రివిక్రమః ఖేఽవతు విశ్వరూపః ||13

దుర్గేష్వటవ్యాజిముఖాదిషు ప్రభుః పాయాన్నృసింహోఽసురయూథపారిః |

విముంచతో యస్య మహాట్టహాసం దిశో వినేదుర్న్యపతంశ్చ గర్భాః ||14

రక్షత్వసౌ మాధ్వని యజ్ఞకల్పః స్వదంష్ట్రయోన్నీతధరో వరాహః |

రామోఽద్రికూటేష్వథ విప్రవాసే సలక్ష్మణోఽవ్యాద్భరతాగ్రజోఽస్మాన్ ||15

మాముగ్రధర్మాదఖిలాత్ప్రమాదాత్ నారాయణః పాతు నరశ్చ హాసాత్ |

దత్తస్త్వయోగాదథ యోగనాథః పాయాద్గుణేశః కపిలః కర్మబంధాత్||16

సనత్కుమారోఽవతు కామదేవాత్ హయశీర్షా మాం పథి దేవహేళనాత్ |

దేవర్షివర్యః పురుషార్చనాంతరాత్ కూర్మో హరిర్మాం నిరయాదశేషాత్ ||17

ధన్వంతరిర్భగవాన్ పాత్వపథ్యాత్ ద్వంద్వాద్భయాదృషభో నిర్జితాత్మ |

యజ్ఞశ్చ లోకాదవతాజ్జనాంతాత్ బలో గణాత్ క్రోధవశాదహీంద్రః |18

ద్వైపాయనో భగవానప్రబోధాత్ బుద్ధస్తు పాషండగణాత్ ప్రమాదాత్ |

కల్కిః కలేః కాలమలాత్ ప్రపాతు ధర్మావనాయోరుకృతావతారః ||19

మాం కేశవో గదయా ప్రాతరవ్యాద్ గోవింద ఆసంగవమాత్తవేణుః |

నారాయణః ప్రాహ్ణ ఉదాత్తశక్తిః మధ్యందినే విష్ణురరీంద్రపాణిః ||20

దేవోఽపరాహ్ణే మధుహోగ్రధన్వా సాయం త్రిధామావతు మాధవో మామ్|

దోషే హృషీకేశ ఉతార్ధరాత్రే నిశీథ ఏకోఽవతు పద్మనాభః ||21

శ్రీవత్సధామాపరరాత్ర ఈశః ప్రత్యూష ఈశోఽసిధరో జనార్దనః |

దామోదరోఽవ్యాదనుసంధ్యం ప్రభాతే విశ్వేశ్వరో భగవాన్ కాలమూర్తిః ||22

చక్రం యుగాన్తానల తిగ్మనేమి భ్రమత్ సమంతాద్భగవత్ప్రయుక్తమ్ |

దందగ్ధి దందగ్ధ్యరిసైన్యమాశు కక్షం యథా వాతసఖో హుతాశః ||23

గదేఽశనిస్పర్శనవిస్ఫులింగే నిష్పిండ్ఢి నిష్పిండ్ఢ్యజితప్రియాసి |

కూష్మాండవైనాయక యక్షరక్షో -భూతగ్రహాంశ్చూర్ణయ చూర్ణయారీన్ ||24

త్వం యాతుధానప్రమథ ప్రేతమాతృ - పిశాచవిప్రగ్రహఘోరదృష్టీన్ |

దరేంద్ర విద్రావయ కృష్ణపూరితో భీమస్వనోఽరేర్హృదయాని కంపయన్ ||25

త్వం తిగ్మధారాసివరారిసైన్యమ్ ఈశప్రయుక్తో మమ ఛింధి ఛింధి |

చక్షూంషి చర్మన్ శతచంద్ర ఛాదయ ద్విషామఘోనాం హర పాపచక్షుషామ్ ||26

యన్నో భయం గ్రహేభ్యోభూత్కేతుభ్యో నృభ్య ఏవ చ |సరీసృపేభ్యో దంష్ట్రిభ్యో భూతేభ్యో అంగోభ్య ఏవ వా ||27

సర్వాణ్యేతాని భగవన్నామరూపాస్త్రకీర్తనాత్ |ప్రయాంతు సంక్షయం సద్యో యే నః శ్రేయః ప్రతీపకాః ||28

గరుడో భగవాన్ స్తోత్రస్తోభశ్ఛందోమయః ప్రభుః |రక్షత్వశేషకృచ్ఛ్రేభ్యో విష్వక్సేనః స్వనామభిః ||29

సర్వాపద్భ్యో హరేర్నామరూపయానాయుధాని నః |బుద్ధీంద్రియమనః ప్రాణాన్ పాంతు పార్షదభూషణాః ||30

యథా హి భగవానేవ వస్తుతః సదసచ్చ యత్ |సత్యేనానేన నః సర్వే యాంతు నాశముపద్రవాః ||31

యథైకాత్మ్యానుభావానాం వికల్పరహితః స్వయమ్ |భూషణాయుధలింగాఖ్యా ధత్తే శక్తీః స్వమాయయా ||32

తేనైవ సత్యమానేన సర్వజ్ఞో భగవాన్ హరిః | పాతు సర్వైః స్వరూపైర్నః సదా సర్వత్ర సర్వగః ||33

విదిక్షు దిక్షూర్ధ్వమధః సమంతాత్ అంతర్బహిర్భగవాన్ నారసింహః |

ప్రహాపయల్లోకభయం స్వనేన స్వతేజసా గ్రస్తసమస్తతేజాః ||34

మఘవన్నిదమాఖ్యాతం వర్మ నారాయణాత్మకమ్ |విజేష్యస్యఽఅంజసా యేన దంశితో ఽసురయూథపాన్ ||35

ఏతద్ధారయమాణస్తు యం యం పశ్యతి చక్షుషా | పదా వా సంస్పృశేత్సద్యః సాధ్వసాత్స విముచ్యతే ||36

న కుతశ్చిద్భయం తస్య విద్యాం ధారయతో భవేత్ |రాజదస్యుగ్రహాదిభ్యో వ్యాఘ్రాదిభ్యశ్చ కర్హిచిత్ ||37

ఇమాం విద్యాం పురా కశ్చిత్ కౌశికో ధారయన్ ద్విజః |యోగధారణయా స్వాంగం జహౌ స మరుధన్వని ||38

తస్యోపరి విమానేన గంధర్వపతిరేకదా |యయౌ చిత్రరథః స్త్రీభిర్వృతో యత్ర ద్విజక్షయః ||39

గగనాన్న్యపతత్సద్యః సవిమానో హ్యవాక్శిరాః |స వాలఖిల్యవచనాదస్థీన్యాదాయ  విస్మితః |

ప్రాస్యప్రాచీసరస్వత్యాం స్నాత్వాధామ స్వమన్వగాత్ ||40

**శ్రీశుక ఉవాచ:**

య ఇదం శృణుయాత్కాలే యో ధారయతి చాదృతః |తం నమస్యంతి భూతాని ముచ్యతే సర్వతో భయాత్ ||41

ఏతాం విద్యామధిగతో విశ్వరూపాచ్ఛతక్రతుః |త్రైలోక్యలక్ష్మీం బుభుజే వినిర్జిత్య మృధేఽసురాన్ ||42

ఇతి శ్రీమద్భాగవతే  మహాపురాణే పారమహంస్యాం సంహితాయాం షష్ఠస్కంధే అష్టమోఽధ్యాయః

*****



# గురుదేవుల జీవన కవనము

## వింశతితమః అధ్యాయః



**ధర్మ** సంస్థాపన మాత్రమే ధ్యేయంగ పని చేస్తున్న గురువుగారు అగ్ని స్వరూపులు. అగ్ని ఎంత పవిత్రమో గురుదేవులు అంతటి పవిత్రం.సంపదలు భోగాలు అన్నిటినీ త్యజించి అగ్ని వంటి స్వచ్ఛమైన కాంతి కలిగి ఉన్నారు. వారి ప్రతి మాట ఒక నిప్పు కణిక. వారి నుండి వచ్చే ప్రతి వాక్కు సత్యమే. మర్యాద పురుషోత్తముడు రాముడు అని మనము విని ఉంటాం, కానీ పద్మాకర్ గారి రూపం లో రాముడిని చూస్తున్నాం. రాముడు ఎలా రాజ్యాన్ని కూడా తండ్రి కొఱకు వదిలివేసాడో, గురువుగారు సంపదలను, భోగాలను,ధనమును కూడా ధర్మం కోసం త్యజించారు.కంచి పీఠం లోనూ ,మైసూరు దత్త పీఠం ,శృంగేరి శారద మఠం లో వారు అనేక ప్రవచనములను అందించారు. గురువుగారి పౌరాణిక జీవితంలో ప్రధాన ఘట్టం భీమవరం భీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న రాధాకృష్ణ మందిరంలో నిర్వహించబడిన భాగవత ప్రవచనం.ఈ కార్యక్రమం రెండు నెలలపాటు జరిగింది ఈ కార్యక్రమం తర్వాత పండితుల సమక్షంలో పద్మాకర్ గారిని పురవీధులలో ఊరేగించి ఘన సత్కారం చేసారు. గొప్ప గొప్ప అవధానుల ముందు భాగవత ధారణ చేసారు గురుదేవులు. నీలకంఠుడు అనే పేరు విన్నాము కానీ భాగవతకంఠుడు,పురాణకంఠుడు ఉంటాడని వినలేదు అని అక్కడి పండితులు గురువుగారిని సన్మానించారు

....ఇంకా ఉంది

శ్రీ ప్రణవపీఠం వారి

## గుడి-బడి

ఏలూరు

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఇచ్చిన పిలుపుతో గురు భక్తులు అందరూ భక్తి తో గుడి-బడి కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో భాగముగా భక్తులు వారి ఊరిలోని ఒక మందిరమును శుభ్రపరచి, సంకీర్తనలు పాడి, నామ స్మరణ చేసుకొని సాధ్యమైన మేరకు అన్న దాన కార్యక్రమములు యథా శక్తిగా నిర్వహించడం జరిగింది. హైదరాబాద్, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, కడప వంటి అనేక నగరములతో పాటు అనేక గ్రామములలో కూడా ఈ కార్యక్రములను గురుభక్తులు నిర్వహించడం జరిగింది. ప్రముఖ దిన పత్రికలలో కూడా గుడి-బడి కార్యక్రమ వివరాలను అందించారు.



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

శ్రావణ, భాద్రపద మాసములను కలిపి వర్ష ఋతువు అంటారు.

శ్రావణమాసం ప్రారంభ మాసం. శ్రావణమాసం లక్ష్మీదేవికి, గౌరీదేవికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసము.

# దూర్వా గణపతి వ్రతం



1) శ్రావణమాసం శుక్లపక్షంలో మధ్యాహ్నం వరకు చతుర్థి ఉంటే ఆ రోజున గణపతిని గరికతో పూజించాలి.

2) ఈ వ్రతాన్ని దూర్వాగణపతి వ్రతం అంటారు.

3) ఈరోజు తెల్లవారుజామున లేచి స్నానం చెయ్యాలి .

4) స్నానానంతరం మొట్టికాయలు నెత్తికి మూడుసార్లు కొట్టుకోవాలి. ఆలయంలో అయితే విగ్రహాలను, ఇంట్లో అయితే హరిద్రా గణపతిని, లేదా అర్క గణపతిని, లేదా శిలా విగ్రహములను పూజించాలి.

5) గణపతిని 108 నామాలతో కానీ, లేదా గణపతి యొక్క పన్నెండు నామాలతో కానీ, లేదా 27 నామాలతో కానీ గరికతో పూజించాలి.

6) 3, 9, 27 సంఖ్యలలో ఉండ్రాళ్ళు నివేదించాలి. ఇలా చేస్తే ఈ మాసంలో వచ్చే అన్ని విఘ్నాలు తొలగిపోతాయి.

7) చేతిలో అక్షతలు తీసుకొని గణపతి చుట్టూ ప్రదక్షిణ చేసి, సాష్టాంగ నమస్కారం చేసి, అక్షతలను గణపతికి వేసి, ఆ అక్షతలను శిరస్సుపై చల్లుకొంటే సకల శుభాలూ కలుగుతాయి.

★★★★★

# గరుడ/నాగ పంచమి

1) గరుత్మంతుడు నాగుల మీద పగబట్టి ఇంద్రుని దగ్గర, విష్ణువు దగ్గర వరం పొంది, పాములను తినేసేవాడు, దీనివలన నాగజాతి అంతరించి పోయే పరిస్థితి ఏర్పడింది.

2) నాగజాతి ప్రముఖులు వాసుకి తదితరులు గరుత్మంతుని వద్దకు వెళ్లి, మా నాగులను పగబట్టి తింటున్నావు ఇలా అయితే మా నాగజాతి కొంతకాలానికి నశిస్తుంది, మా జాతిని రక్షించుకోవడానికి నీతో ఒడంబడిక చేసుకుంటాం అన్నారు.

3) వాసుకి, ఆదిశేషుని పైన ఉన్న గౌరవంతో గరుత్మంతుడు అంగీకరించాడు.

4) ప్రతిమాసం ఒక తిథినాడు మాలో ఒక పామును నీకు ఆహారంగా పంపిస్తాము, పాముతో పాటు కొంత అన్నం కూడా పంపుతాము, మేము పంపే పాము మరియు ఆహారమును స్వీకరించవలసిందిగా నాగులు కోరారు.

5) ఈ ఒడంబడిక వల్ల నెలకు ఒక పాము మరణిస్తుంది, నీకు ఇంద్రుడు, విష్ణువు ఇచ్చిన వరములు కూడా భ్రష్టు కాకుండా ఉంటాయి, కావున దయతో అంగీకరించమని నాగులు అభ్యర్థించారు. అందుకు గరుత్మంతుడు కూడా సమ్మతించాడు.

6) అలా వాసుకి, గరుత్మంతునికి ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి మాసమునందు ఒక తిథినాడు పాముతో పాటు చలివిడి, చిమ్మిలి గరుత్మంతునికి ఆహారంగా పంపేవారు.

7) నాగులకు మరియు గరుత్మంతునికి శ్రావణ మాస శుక్లపక్షం పంచమి తిథి నాడు ఒప్పందం కుదిరింది. ఈ తిథినే నాగపంచమి అని, గరుడపంచమి అని పిలుస్తారు.

8) గరుత్మంతుని ఒప్పందానికి మెచ్చుకున్న శ్రీమహావిష్ణువు శ్రావణ శుక్ల పంచమి నాడు గరుత్మంతుడిని, గరుత్మంతుని నామాలను తలుచుకొని పానకం నివేదించాలని, నాగ దేవతలను కూడా చిమ్మిలి, చలివిడి నివేదించి పూజించాలని వరమిచ్చాడు.

9) ఇలా చేయటంవల్ల నాగ దోషాలు, నాగ బాధలు, పక్షి దోషాలు, అపశకునం, పక్షుల వల్ల కలిగే దోషాలు పోతాయి అని విష్ణువు వరం ఇచ్చాడు.

★★★★★



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# వరలక్ష్మీ వ్రతం

1) శ్రావణ మాస పూర్ణిమకి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీవ్రతం.



2) ప్రయాగలో ఋషులు ఒక యాగం చేసారు, నారద మహర్షి ఒక రోజు వచ్చి త్రిమూర్తులలో యాగ ఫలితాన్ని ఎవరికి ధారబోస్తున్నారు అని ప్రశ్నించాడు. అప్పుడు తామింకా ఆలోచించలేదు, అని ఋషులు బదులు ఇచ్చారు.

3) త్రిమూర్తులలో ఒకరికి ధారపోయాలని నిర్ణయించారు.

4) భృగు మహర్షి, త్రిమూర్తులను పరీక్షించి వారిలో ఒకరికి ధారబోయాలని నిర్ణయించాడు, అందులో భాగంగా వైకుంఠమునకు వెళ్లాడు.

5) భృగు మహర్షి తనను వైకుంఠంలో అవమానించారని, విష్ణువును వక్షఃస్థలం పైన తన వామపాదంతో తన్నాడు.

6) తన నివాసస్థలం అయిన విష్ణు వక్షఃస్థలం పై జరిగిన సంఘటనకు ఆగ్రహించక, భృగు మహర్షికి విష్ణువు సేవ చేసాడని కోపంతో, లక్ష్మీదేవి వైకుంఠం వదిలి భూలోకములో కరవీరపురమునకు వచ్చింది.

7) ఈ కథ స్వాయంభువు మనువు కాలంలో జరిగింది.

8) లక్ష్మీదేవిని అవమానించిన భృగువు పాప ప్రాయశ్చిత్తం కోసం కరవీరపురం వెళ్లి స్వయంభూ రూపంలో కొలువై ఉన్న లక్ష్మీదేవి కోసం తపస్సు చేసాడు.

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

9) అమ్మ ప్రత్యక్షమై వరము కోరుకోమన్నది. లక్ష్మీదేవిని తనకు కూతురుగా జన్మించవలసిందిగా అమ్మను వరం కోరాడు. ఆ తరువాత నిన్ను విష్ణువుకిచ్చి వివాహం చేస్తా అన్నాడు.

10) అమ్మ "తథాస్తు" అన్నది. ఐదు శుక్రవారముల పాటు విడిచిపెట్టకుండా పూజించి, ఆవుపాలతో అభిషేకించి, ఆవుపాల పాయసం నివేదించమన్నది. భృగు మహర్షి అలానే చేసాడు.

11) భృగుమహర్షికి, ఖ్యాతికి శ్రావణమాస పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నాడు లక్ష్మీదేవి జన్మించింది. వరములిచ్చే లక్ష్మీదేవి జన్మించడం వలన వరలక్ష్మి అనే పేరు వచ్చింది.

11) భృగు మహర్షి కూతురు అవడం వల్ల అమ్మకి భార్గవి అని పేరు వచ్చింది. శ్రావణ మాస శుక్ల పక్ష పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారంనాడే విష్ణువుకిచ్చి అమ్మను వివాహం చేసాడు.

12) వివాహానంతరం సాయంత్రం లక్ష్మీనారాయణులను ప్రత్యక్షంగా ఆసనంపై కూర్చోబెట్టి భృగుమహర్షి వరలక్ష్మీ వ్రతం ఆచరించాడు.

## ఆచరించవలసిన విధి:

1) ఈ రోజు భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవిని పూజించాలి. వరలక్ష్మీవ్రతం చేసిన వారికి సకల శుభములు కలిగి అమ్మవారి దివ్య కటాక్షం లభిస్తుంది.

2) వరలక్ష్మి వ్రతాన్ని స్త్రీలు, పురుషులు అందరూ చేసుకోవాలి. స్త్రీలైతే తప్పకుండా వరలక్ష్మీ పూజ చేసుకోవాలి.

3) పురుషుడు చేస్తే ధనం పెరుగుతుంది, భార్యాభర్తలు ఆనందంగా ఉంటారు. స్త్రీ చేస్తే సౌభాగ్యం కలుగుతుంది. ఇద్దరూ కలసి చేస్తే జీవితకాలం సంతోషం కలుగుతుంది.

4) ఉదయం లేచి తలారా స్నానం చేయాలి. శుచిగా ఉన్న వస్త్రాలు కట్టుకోవాలి.

5) ఒక మండపం పెట్టుకొని, నూతన వస్త్రాన్ని పరచి, కలశస్థాపన చేయాలి. కలశంలో అమ్మవారిని ఆవాహనం చేసి షోడశోపచార పూజ చేయాలి. చారుమతి కథ, భృగు మహర్షి కథ వినాలి.

6) పాయసాన్నం, దధ్యోదనం, పులిహోర నివేదించాలి. తాము తిని ఇతరులకు పెట్టాలి. ఇలా చేసిన వారికి జీవితంలో అన్న పానీయాలకు లోటు ఉండదు.

7) కొబ్బరికాయ ఒకటికి తక్కువ కాకుండ కొట్టి, పానకం, వడపప్పు, చలిమిడి నివేదించాలి.

8) ముత్తైదువలకు పూజ చేసి గాజులు, వస్త్రములు, కాటుక, తాంబూలము ఇవ్వాలి.

9) బ్రహ్మచర్య దీక్ష తప్పనిసరిగా పాటించాలి. నేల పైన పడుకోవాలి. కుదరని వారు కొత్త దుప్పటి పరచుకొని చెక్క పైన నిదురించవచ్చు. సాయంత్రం వేళ లక్ష్మీదేవి యొక్క గుడిలో ప్రదక్షిణలు చేయాలి.

10)లక్ష్మీనారాయణులు గురుదంపతుల రూపంలో ఉంటారు. గురుదంపతులను పూజించి ప్రదక్షిణ చేయాలి. కుదరని వారు కనీసం గురువులపటం పెట్టుకుని పూజించాలి.

11) అమ్మవారిని పసుపుకొమ్ములతో అర్చించాలి, శ్రీ సూక్తం పారాయణం తప్పకుండా చేయాలి లేదా వినాలి.

12) అమ్మవారిని అష్టోత్తరశత నామాలతో, బిల్వ పత్రాలతో పూజించాలి. ఇలా చేయటం వల్ల సంపదలకు లోటు ఉండదు.

13) శక్తిని అనుసరించి సువర్ణ, రజత దానాలు చేయాలి, అన్నదానం చేయాలి. కప్పుకోవడానికి పనికొచ్చే దుప్పటి కానీ, శాలువా కానీ మహానుభావులయిన గురువులకు దానం చేస్తే, భార్యాభర్తలు ఎప్పుడూ ఐకమత్యంతో జీవిస్తారు.

**గమనిక:**

1) వ్రతమును ఈరోజు (పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం) ఆచరించలేకపోతే, చివరి శుక్రవారం చేసుకోవచ్చు.

2) సంపదలు అనగా ఒక్క ధనము మాత్రమే కాదు, సంతానం, ఆరోగ్యం, విద్య తదితరములు కూడా.

3) వ్రతముల నాడు తలంటు స్నానం పనికిరాదు.

★★★★★

## మంగళగౌరీ వ్రతం

1) పార్వతీ అమ్మవారు అనేక వర్ణములు కలిగి ఉండేది. పార్వతీ అవతారంలో అమ్మ నల్ల కలువ వర్ణంలో ఉండేది. ఒకసారి శివుడు పార్వతీ అమ్మవారిని సతీదేవిలా కాకుండా నలుపు వర్ణంలో ఉన్నావని అన్నాడు. అలిగిన అమ్మవారు తపస్సుతో నలుపు వర్ణాన్ని విడిచి గౌరవర్ణం (తెలుపు రంగు) ధరించింది. అమ్మవారు గౌరవర్ణం ధరించిన రోజు శ్రావణమాసంలో వచ్చే మొదటి మంగళవారం. గౌర వర్ణంలో ఉండటం వలన అమ్మవారిని "గౌరి" అన్నారు.

2) ఒకసారి శివ దంపతులు మానవులను రక్షించాలని అనుకున్నారు. గౌరీదేవి శ్రావణమాసంలో ప్రతి మంగళవారం నాడు భూసంచారం చేసి, తాను చెప్పిన విధంగా చేసిన స్త్రీలను అనుగ్రహిస్తాను అని అన్నది.

3) భూలోకంలో అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర ద్వారా మంగళగౌరీ వ్రతాన్ని అమ్మ వ్యాపింపచేసింది.

4) ఈ వ్రతం చేసిన వారింట్లో గౌరీదేవి కొలువై ఉంటుంది. స్త్రీలకు శాశ్వతంగా ముత్తైదువగా ఉండే వరాన్నిస్తుంది.



# శ్రావణ పౌర్ణమి

1) శ్రావణ మాసం లో అపూర్వ దినం శ్రావణ పౌర్ణమి.

2) **శ్రావణ పౌర్ణమిని రక్షాబంధన్ పౌర్ణమి అని, హయగ్రీవ పౌర్ణమి అని, జంధ్యాల పౌర్ణమి అని అంటారు.**

3) ఒకప్పుడు సోమకుడు (సోమకాసురుడు) అనే రాక్షసుడు ఉండేవాడు. బుర్రలో జ్ఞానాన్ని లాగేయటం ఇతనికున్న వరం. సోమకుడినే హయగ్రీవుడు అని కూడా అంటారు. బ్రహ్మజ్ఞానాన్ని కూడా అపహరించే శక్తి కలిగినవాడు ఈ సోమకాసురుడు. ఈ వరాన్ని బ్రహ్మ ఇచ్చాడు. బ్రహ్మని రక్షించటానికి విష్ణువు మత్స్యావతారం ధరించి వధించాడు.

6) సోమకుడు హయగ్రీవరూపం ధరించాడు. విష్ణువు హయగ్రీవ అవతారమెత్తి, హయగ్రీవుడిని వధించి వేద జ్ఞానాన్ని తిరిగి బ్రహ్మకు ఇచ్చాడు.

7) శ్రావణ పౌర్ణమి నాడే విష్ణువు హయగ్రీవ అవతారం ఎత్తి, వేదములను సంరక్షించాడు, అందుకే హయగ్రీవ పౌర్ణమి అంటారు.

8) ఈ దినమున ప్రొద్దునే లేచి స్నానం చేయాలి. హయగ్రీవుడ్ని ఆవాహనం చేసి, శంఖ పుష్పాలతో లేదా తెల్లని పుష్పాలతో పూజించాలి.

9) హయగ్రీవుడు జ్ఞానానందస్వరూపుడు. పిల్లలు హయగ్రీవుని పూజించటం వల్ల విద్యాభివృద్ధి కలుగుతుంది.

## చేయవలిసిన విధులు:

1) కొత్త పెళ్లికూతురు తప్పనిసరిగా శ్రావణమంగళవార నోము నోచుకోవాలి. పెళ్ళైన దగ్గరినుండి ఐదేళ్లు విడిచిపెట్టకుండా చేసుకోవాలి.

2) ఉదయాన్నే లేచి తలారా స్నానం చేసి శుభ్రమైన వస్త్రాన్ని ధరించాలి, బొట్టు పెట్టుకోవాలి.

3) గణపతిని పూజించాలి. తరువాత మళ్ళీ శుభ్రవస్త్రం ధరించాలి. మంగళగౌరీ వ్రతమునకు కట్టుకొన్న వస్త్రాలను మళ్ళీ మరొక వ్రతమునకు వాడకూడదు.

4) మంగళవారం అమ్మను పూజించాలి. గౌరీదేవికి షోడశోపచారాలు చేయాలి, వ్రతకథ చదవాలి, అమ్మని భక్తితో పూజించాలి. సాయంత్రం లేదా పూజ అనంతరం పగలు కానీ, శనగలు వాయనం ఇవ్వాలి. ముత్తైదువలకు పసుపు, గంధం పూసి తమలపాకులు, వక్కలు, అరటిపండ్లు, గాజులు, వస్త్రములతో తాంబూలం ఇవ్వాలి.

5) నువ్వుల నూనె లేదా ఆవునెయ్యి తో దీపం వెలిగించాలి, బాగా పొగ వచ్చేటట్టు చేసి ఇనుపగరిట పెట్టి కాటుక పట్టాలి. ఆ కాటుకను తాము పెట్టుకొని ముత్తైదువలకు ఇవ్వాలి. తాజా ఆవు నెయ్యినే వాడాలి, తాజా ఆవు నెయ్యి దొరకనప్పుడు తాజా నువ్వుల నునె మాత్రమే కాటుక పట్టడానికి వాడాలి.

6) గురుదంపతులను, పెద్ద దంపతులను పూజించాలి. ఈ వ్రతం చేసిన వారికి అమ్మ అనుగ్రహం వల్ల చర్మమునుకు సంబంధించిన రోగాలు పోయి కాంతివంతం అవుతుంది.

★★★★★



10) పౌర్ణమి నాడు హయగ్రీవ పటం కానీ, విగ్రహం కానీ పెట్టి పిల్లలతో పూజ చేయించాలి. హయగ్రీవ మంత్రాన్ని చెప్పించాలి. ఇలా చేయటం వల్ల పిల్లలో జ్ఞానం పెరుగుతుంది, మాతృ, పితృ భక్తి పెరుగుతుంది. పిల్లలు ఉత్తములుగా మారుతారు.

11) ఈ రోజు ఏడు తోరములు (ముడి) కలిగిన దారం తయారుచేసి గౌరీ దేవి ముందు పెట్టాలి. యథాశక్తిగా పూజించాలి, పసుపు కుంకుమ బొట్లు పెట్టాలి. పూజ అయ్యాక స్త్రీలైనా పురుషులైనా కుడి చేతికి తోరమును కట్టుకోవాలి. ఇలా చేయటం వల్ల విజయం లభిస్తుంది, శత్రుబాధ తగ్గుతుంది.

12) ఈ రోజు తప్పనిసరిగా జంధ్యం మార్చుకోవాలి. ఈ రోజు నదులలో కానీ, చెరువులో కానీ, నూతిలో కానీ, బావుల వద్దకానీ స్నానం చేయాలి. కుదరకపోతే ఇంట్లో కూడా చేయవచ్చు, నీళ్లలో అవుపాలు కానీ పెరుగు కానీ చిటికెడు పసుపు కానీ కలుపుకొని నీటి పై చేయి వేసి గంగ అని ముమ్మారు పలికి స్నానం చేయాలి. స్నానానంతరం యజ్ఞోపవీతం మార్చుకోవాలి. శుక్రవారం అయితే పాత యజ్ఞోపవీతాన్ని శనివారం తీసివేయాలి.

13) ఈ రోజు అందరూ గాయత్రీజపం చేయాలి. ఉపనయనం లేని వారు, స్త్రీలు చేయటానికి దేవీభాగవతంలో శ్లోకం ఉంది. గాయత్రీ జపం వల్ల అనేక యజ్ఞములు, యాగములు, దానములు చేసిన ఫలితం వస్తుంది.

దేవీభాగవతం లోని శ్లోకం:

శ్లో|| యోదేవ స్సవితా౽స్మాకం ధియో ధర్మాదిగోచరాః |
ప్రేరయేత్తస్య యద్భర్గః తద్వరేణ్య ముపాస్మహే ||

14) ఈ రోజు ఒక్క సారి గాయత్రీ మంత్రం జపిస్తే వేయి సార్లు జపించిన ఫలితం దక్కుతుంది. ఈరోజు అందరూ వేదం శ్రవణం చేయాలి. వేదపండితులకు దానం చేయాలి.

15) అందరూ ఈ రోజున గాయత్రీమాతని భక్తితో పూజించాలి. గాయత్రీమాత భూలోక సంచారానికి వచ్చింది ఈ శ్రావణ పౌర్ణమి నాడే. గాయత్రీ సహస్రనామ స్తోత్రం చదవాలి. ఈ రోజు అమ్మవారిని కుంకుమతో పూజించి, ప్రదక్షిణ చేయాలి. గురుపత్నికి కానీ లేదా ముత్తైదువకు కానీ చీర సమర్పించాలి.

16) రక్షా బంధన్ పౌర్ణమి కూడా కాబట్టి, సోదరునికి సోదరి హరినామాన్ని స్మరిస్తూ రక్షా బంధనం కట్టాలి.

i) ఇంద్రుని అపచారం వల్ల దూర్వాస మహర్షి శాపం వల్ల లక్ష్మి సముద్రంలో కలసిపోయింది. క్షీరసాగరమథనం వల్ల రేవంతుడు, ఆ తర్వాత లక్ష్మి పుట్టారు. అందువలన రేవంతుడు లక్ష్మికి సోదరుడు అయ్యాడు.



ii) ఒకసారి లక్ష్మి దర్శనార్థం రేవంతుడు వైకుంఠం వచ్చాడు, వస్తున్న సోదరుడిని చూస్తున్న లక్ష్మిని విష్ణువు మూడు సార్లు పిలిచినా పట్టించుకోలేదు. అప్పుడు విష్ణువు ఆగ్రహించి లక్ష్మిని గుఱ్ఱం అయిపోమని శపించాడు.

iii) శాపానికి కారణమున్నదని చెప్పిన విష్ణువు, సంతానం కలిగాక శాపవిముక్తి కలుగుతుందని అన్నాడు. కొంత కాలానికి విష్ణువు కూడా ఒక గుఱ్ఱం అయ్యాడు. గుఱ్ఱం రూపంలో లక్ష్మీనారాయణులకు పుట్టిన సంతానానికి హయహయుడు అని పేరు వచ్చింది.

iv) శ్రావణపౌర్ణమి నాడు అమ్మకు సంతానం కలిగి శాపవిముక్తి కలిగింది.

v) లక్ష్మీదేవి విష్ణువుతో, స్వామీ శాపవిమోచనం కలిగింది కానీ ఇక నా సోదరుడు నన్ను చూడటానికి రాడు అన్నది. సోదరుడికి, సోదరికి బంధం ఉండటానికి మంచి మార్గం చూపించండి అని అన్నది.

vi) నీకు శాపవిమోచనమైన ఈ శ్రావణపౌర్ణమిని రక్షా బంధన పౌర్ణమిగా మారుస్తున్నా అని విష్ణువు అన్నాడు. ఈ రోజును సోదరసంబంధమైన రక్షాబంధన ఉత్సవంగా మారుస్తున్నా అని వరమిచ్చాడు. ఈ రోజున నీవు వెళ్లి నీ సోదరుడు రేవంతుడికి రక్షా బంధనం కట్టు. రక్షా బంధనం కట్టేటప్పుడు హరి నామాన్ని తలుచుకోవాలి అన్నాడు. అప్పటి నుండి రక్షా బంధన ఉత్సవం మొదలైంది.

★★★★★

# కృష్ణాష్టమి



1) సకల లోకేశ్వరుడు, ఆకర్షణ స్వరూపుడు, అయిన కృష్ణుడి యొక్క ఆవిర్భావం జరిగిన రోజు శ్రావణ మాసం, కృష్ణపక్షం, అష్టమీతిథి.

2) ఒకప్పుడు భూమండలంలో పాపాత్ములు పెరిగిపోయారు, రాక్షసులు భూలోకంలో మహారాజుల రూపం ధరించారు. కంసుడు, జరాసంధుడు, దంతవక్త్రుడు వీరందరూ రాక్షసులు. కాలనేమి అనేవాడు కంసుడిగా పుట్టాడు, కలిపురుషుని అంశతో దుర్యోధనుడు పుట్టాడు.

3) భూమి ఈ పాపాత్ములందర్నీ భరించలేక ఓ గోవు రూపం ధరించి బ్రహ్మ దగ్గరకు వెళ్ళి, కన్నీరుమున్నీరుగా విలపించింది. బ్రహ్మను రక్షించమని కోరింది. సత్యవంతులు ఎంతమంది ఉన్నా నేను భరిస్తాను, కానీ ఒక్క పాపాత్ముడినైనా నేను భరించలేను అన్నది.



4) భూమిని ఓదార్చి, దేవతలందరితో కలిసి వైకుంఠానికి వెళ్ళాడు బ్రహ్మ, అక్కడ విష్ణు భగవానుడిని ప్రార్థించాడు. వైకుంఠంలో విష్ణువు బ్రహ్మకు దర్శనం ఇవ్వలేదు, అప్పుడు కళ్ళు మూసుకొని పురుషసూక్తంతో విష్ణువును ప్రార్థించాడు. అప్పుడు బ్రహ్మకు కేవలం మాటలు మాత్రమే వినబడ్డాయి.

5) భూభారాన్ని తగ్గించడానికి విష్ణువు ప్రణాళిక వేసుకొన్నాడు, త్వరలో వసుదేవుని ఇంట పుట్టబోతున్నా అన్నాడు భగవంతుడు శ్రీమన్నారాయణుడు.

6) కృష్ణుడికి సేవ చేయడం కోసం దేవతలు యాదవులుగా పుడతారు, ఆదిశేషుడు బలరాముడు అనే రూపంలో అవతరిస్తాడు అని చెప్పాడు.

7) ప్రపంచం మాయ చేతిలో కీలు బొమ్మ, ఆ మాయకు వైష్ణవమాయ అని పేరు, ఆ యోగమాయ విష్ణువుకు సాయం చేయడానికి విష్ణుమాయగా యశోదాదేవికి అదే సమయంలో జన్మిస్తుంది.

8) కృష్ణుడు నూటపాతికేళ్ళు ఉంటాడు, ధర్మసంస్థాపన చేస్తాడు అని చెప్పాక భూదేవి వెళ్ళిపోయింది.

9) అష్టమగర్భంలో దేవకి – వసుదేవులకు స్వామివారు ఆవిర్భవించారు, అదే సమయంలో యశోద గర్భంలో యోగమాయ ప్రవేశించింది.

10) చెరసాలలో దేవకీగర్భంలో ఉన్న కృష్ణుణ్ణి ప్రార్థించడానికి దేవతలందరూ వెళ్లారు. మాతృగర్భం నుండి రమ్మని కృష్ణుణ్ణి ప్రార్థించారు.

11) శ్రావణ మాసం కృష్ణపక్ష అష్టమీ తిథి వచ్చింది, గ్రహాలు ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు, నక్షత్రాలు భద్రస్థితిలో ఉన్నప్పుడు, ధర్మసంస్థాపన చేయగలిగేవాడు అయినటువంటి కృష్ణుడు ఆవిర్భవించాడు.

12) అర్జునుడికి రథసారథియై, భగవద్గీత అనే శాస్త్రాన్ని మానవాళికి అందించాడు శ్రీకృష్ణుడు. అందుకు జగద్గురువు అయ్యాడు.

## చేయవలసిన విధులు:

1) ఈరోజు ఉదయాన్నే బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేవాలి, తలారా స్నానం చేయాలి. భక్తితో కృష్ణుడి యొక్క పటం కానీ విగ్రహంకానీ పెట్టుకొని యథాశక్తిగా పూజించాలి.

2) భగవంతుడు కృష్ణుడు భక్తితో ఏమాత్రం అలంకారాన్ని సమర్పించినా స్వీకరిస్తాడు. భక్తితో ఫలం, పుష్పం, పత్రం సమర్పిస్తే ఆ భగవంతుడు స్వీకరిస్తాడు.

3) కృష్ణుని విగ్రహం ముందు పెట్టుకొని షోడశోపచార పూజలు చేయాలి, తులసీదళాలతో పూజించాలి.

4) మంచి ఉద్యోగం కోసం కృష్ణాష్టమి నాడు తులసీదళాలతో పూజించాలి. కృష్ణుడికి తాజా వెన్న సమర్పించాలి. కృష్ణాష్టమి నాడు కృష్ణుడికి ఆవుపాలతో చేసిన పాయసం నివేదిస్తే, ఎటువంటి అనారోగ్యం దరిచేరదు.

5) సాయంత్రం కృష్ణ మందిరానికి వెళ్లి కృష్ణదర్శనం చేసుకోవాలి. గురువుగారికి ప్రదక్షిణ చేసి గురువుగారికి పూజ చేయాలి. కృష్ణాష్టమి నాడు ఉట్టి కొట్టే కార్యక్రమం చేయాలి. ఈరోజు అందరూ తప్పకుండా గోసేవ చేయాలి.

★★★★★